క్లుప్తంగా

మంచి నీటి సమస్య లేకుండా చూడండి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సంగారెడ్డి నియోజకవర్గంలోని సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలో మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం అధికారులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటికొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో బోరు మోటార్ వేయాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. సుదూర ప్రాంతాల గ్రామాలు, తండాల్లో నీటి సమస్యకు వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేసి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

ప్రత్యేక పూజలు


పసుపు కోట్నం కార్యక్రమంలో గోదావరి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలోని రామాలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు రజిని, కాలనీవాసులు నారాయణ, శ్రీనివాస్, జనార్ధన్, భీమా రెడ్డి, సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవానికి రండి


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు: శ్రీ రామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని కోదండ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ దంపతులు, ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 8వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

రాయికోడ్(అందోల్): నీటిని వృధా చేయకుండా పొదుపుగా వినియోగించుకుని భూగర్భ జలాలను కాపాడుకోవాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుల జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్ అన్నారు. రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీ నిధులతో తవ్వించిన బోరును ఎంఈఓ అంజయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న పాటిల్, మధు పాటిల్ ఉన్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి


అమరులకు నివాళులర్పిస్తున్న అబ్రహం మాదిగ తదితరులు

జహీరాబాద్ టౌన్: దండోర ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి అమరులైన మాదిగల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ కోరారు. ఉద్యమంలో అమరులైన మాదిగలకు శుక్రవారం పట్టణంలోని అతిథి గృహంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల నుంచి ఎస్సీ రిజర్వేషన్ కోసం ఎంతో మంది ఉద్యమాలు చేశారన్నారు. ఉద్యమంలో జిల్లాకు చెందిన అమృత్, ప్రకాష్, రవీందర్, బాలరాజ్, మొల్లప్ప, పద్మారావులు అమరులయ్యారన్నారు. ఉద్యమమే ఊపిరిగా జీవించి అమరత్వం పొంది చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు.

వెండి కిరీటాల బహూకరణ

నారాయణఖేడ్: పట్టణంలోని రామాలయంలోని రామ, లక్ష్మణ, భరతుడితో పాటు హన్మంతుడికి అజ్ఞాత భక్తులు శుక్రవారం వెండి కిరీటాలను బహూకరించారు.

యువత సంక్షేమానికే యువ వికాసం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి, అధికారులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర, చిత్రంలో అధికారులు జగదీశ్, అఖిలేశ్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి జోన్: అన్ని వర్గాల నిరుపేద నిరుద్యోగ యువకులకు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డిలో రాజీవ్ యువ వికాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఈ పథకం ద్వారా రూ.లక్ష వరకు రుణం తీసుకున్న వారికి 90% రాయితీ, రూ. 2లక్షల రుణం తీసుకున్న వారికి 80%, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల లోపు రుణం తీసుకున్న వారికి ప్రభుత్వం 70% రాయితీ ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ కాపీలను మున్సిపల్ కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలలో అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి జగదీశ్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ/గిరిజన సంక్షేమ శాఖ (ఇన్‌చార్జి) అధికారి అఖిలేష్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రామాచారి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాంపురోడ్డుపై వాహనదారుల ఇక్కట్లు

- నిత్యం ట్రాఫిక్ సమస్యనే
- రైల్వేలైన్‌పై వంతెన పనులు వేగవంతం చేయండి


రింగ్‌రోడ్డును ఆనుకుని ర్యాంపు రోడ్డుపై నిలిపోయిన వాహనాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి, వెలిమెల గ్రామాల మధ్య రింగ్‌రోడ్డును ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ఏళ్లుగా సర్వీస్‌రోడ్డును పూర్తి చేయకపోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. రింగ్‌రోడ్డు నిర్మాణ సమయంలో ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామాల మధ్య రైల్వేలైన్ ఉండటంతో అప్పటి అధికారులు రింగ్‌రోడ్డు ఆనుకొని తాత్కాలికంగా ర్యాంపురోడ్డును నిర్మించారు. రింగ్ రోడ్డును ఆనుకొని అనేక పాఠశాలలు, కళాశాలలు రావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాల సంఖ్య పెరగటంతో నిత్యం ర్యాంపు రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గతంలో అనేకసార్లు రింగ్‌రోడ్డుపై వేగంగా వెళ్తూ పలు భారీ వాహనాలు ర్యాంపు రోడ్డుపై పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఈ సమస్యను హెచ్ఎండీఏ, రైల్వే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి రైల్వేలైన్‌పై వంతెన పనులను ప్రారంభించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు వంతెన పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిత్యం వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన పనులను వేగవంతం చేసి దానిని త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు నర్సింలు, సంజీవ్ రెడ్డి, జగన్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్, రాజ్యాంగ పరిరక్షణ సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరుస్తూ కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

జోగిపేట(అందోల్): రాష్ట్రంలో ప్రతి ఏడాది విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ అన్నారు. శుక్రవారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాలులోని వేదికకు కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ కాలనీగా నామకరణం చేసిన జిల్లా 7వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని తీవ్రంగా విమర్శించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, మహేష్ , టీ.రాజేష్ , సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా సాగితేనే గుర్తింపు

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్


మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ఐకమత్యంతో ముందుకు సాగితేనే గుర్తింపు సాధ్యమని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా... ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నీలం మధు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు రాజకీయ చైతన్యం అలవర్చుకోవాలన్నారు. రాజకీయ చైతన్యంతోనే జాతి మనుగడ సాధ్యమని వివరించారు. ప్రభుత్వం ముదిరాజ్ ల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనతో ముదిరాజులకు మంచి రోజులు రానున్నాయని జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాంగోపాల్, రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జగన్మోహన్, మాజీ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ పిట్టల రవీందర్, డీఎల్ పాండు, చేన్నవేని రాములు, సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలి

జిన్నారం (పటాన్‌చెరు): యువత స్వశక్తితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఎంటిక లింగం అనే యువకుడు ఏర్పాటుచేసిన పేపర్ ప్లేట్ తయారీ ప్లాంట్ ను గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు సదానంద రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వాసుదేవరెడ్డి, సూర్యనారాయణ, ఆంజనేయులు, సుధాకర్, చంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, యాదగిరి, జైపాల్ రెడ్డి, శేఖర్, రాము, ట్రస్ట్ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పటాన్‌చెరుటౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పటాన్‌చెరు ఏఈ జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌తో పాటు పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాటు విరమించండి


రిలే నిరాహార దీక్షలో ఆలయ కమిటీ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసనలు 59వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, గుమ్మడిదల, ప్యారానగర్ ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం బొంతపల్లి దేవాలయ కమిటీ సభ్యులు నిరాహార దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు డంపింగ్ యార్డ్ విరమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నబోయిన వేణు, మద్దుల బాల్‌రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకంపై అవగాహన అవసరం

జిన్నారం (పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకాన్ని పట్టణ ప్రజలకు సంపూర్ణంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2025- 26 సంవత్సరానికి ముందస్తు పన్ను చెల్లింపుదారులకు ఐదు శాతం రాయితీతో చెల్లించవచ్చన్నారు. అనంతరం మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్ల ప్రక్రియపై మాట్లాడారు. మున్సిపాలిటీలో రూ.15.98 కోట్లకు గానూ 14.8 కోట్ల పన్నులు 88 శాతంగా వసూలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 12వ స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం పై అధికారుల బృందాన్ని అభినందించారు. లక్ష్యాలను చేరేందుకు కృషి చేసిన అధికారులు సిబ్బందిని కమిషనర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింలు, మేనేజర్ మల్లికార్జున స్వామి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం అరికడదాం

పొగాకు జిల్లా నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి


పొగాకు నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: యువతలో పొగాకు వినియోగాన్ని అరికడదామని పొగాకు జిల్లా నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో శుక్రవారం బస్టాండ్ పరిసర ప్రాంతాలలో పొగాకు నియంత్రణపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పొగాకు జిల్లా నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ...యువత పొగాకు వినియోగం, గుట్కాలు తింటూ చిన్న వయసులోనే వివిధ రకాల కేన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి పొగాకు రహిత గ్రామాలకు తీర్చిదిద్దడం లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇందులోభాగంగానే ప్రతీరోజు ఏదో ఒకచోట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సోమ్లు రామావత్, దత్తు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణలో కేంద్రం విఫలం


నిరసన తెలుపుతున్న ముస్లింలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మైనార్టీ ముస్లింల హక్కులను పరిరక్షించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి విఫలం చెందుతుందని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అబ్దుల్ ఘనీ అన్నారు. శుక్రవారం పట్టణంలో వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం చేయడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును సవరణ చేయటం ఎంత వరకు సబబు అన్నారు. ఇప్పటికైనా కేంద్రం వక్ఫ్ బిల్లు సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి


నారాయణఖేడ్: సన్నబియ్యం పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. నిజాంపేట్ మండల కేంద్రంలో పౌరసరఫరాల శాఖ తరపున ఉచిత సన్నబియ్యం పథకాన్ని ఆర్డీఓ అశోక చక్రవర్తితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో ఒక్కరికి కూడా రేషన్ కార్డును జారీ చేయలేదని అన్నారు. ఎందరో పెళ్లిళ్లు అయి, పిల్లలు అయినా కార్డులు ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాధాకిషన్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు రఘుపతిరెడ్డి, గోలి రాములు, శంకర్, శ్రీకాంత్, శంకర్‌గౌడ్, నారాయణ రెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం**

సంగారెడ్డి టౌన్: బార్ అసోసియేషన్ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి శివకుమార్ సంగారెడ్డిలోని కోర్టు కార్యాలయంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, సంయుక్త కార్యదర్శిగా మల్లేశ్, కోశాధికారిగా శ్రీకాంత్, గ్రంథాలయ కార్యదర్శిగా నిజాముద్దీన్ రషీద్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.

◆ **ఉపాధి కూలీ బకాయిలు చెల్లించాలి**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి):ఉపాధి హామీ కూలీలకు రెండు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్ శివారులో కూలీలు పని చేస్తున్న ప్రదేశం వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పని ప్రదేశంలో కూలీలకు మంచినీళ్లు, మెడికల్ కిట్, నీడ కోసం టెంట్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజయ్య, నరేశ్,సతీశ్,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రామస్తుల ఆందోళన**

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం మంగంపేటలో హెటిరో పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ను ఓ వెంచర్ యాజమాన్యం అకారణంగా తొలగించడంపై శుక్రవారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం లేకుండా బస్ షెల్టర్ తొలగించిన వెంచర్ యాజమాన్యంపై పంచాయతీ కార్యదర్శి తగు విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

◆ **బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం**

నారాయణఖేడ్: ఖేడ్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కొంగరి భోజిరెడ్డిని శుక్రవారం న్యాయవాది, ఖేడ్ పట్టణ ఏఐఎంఐఎం అధ్యక్షుడు మొహిద్ పటేల్ శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి కృషిచేయాలని ఆయన వారిని కోరారు.

◆ **కార్మిక హక్కులను కాలరాస్తున్నాయి**

నారాయణఖేడ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి నల్లవల్లి రమేశ్ ఆరోపించారు. ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఖేడ్‌లో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పంచాయతీల వద్ద సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమ్మెను విజయవంతం చేసి ప్రభుత్వాలపై సమస్యలు పరిష్కరించేలా వత్తిడి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం బాధ్యులు జనాబాయి, జ్యోతి, సాయమ్మ, కల్పన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

◆ **సాఫల్య పురస్కారాలు అందజేత**

సంగారెడ్డి: సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శుక్రవారం 2024 -25 ఏడాదికి సంబంధించిన సాఫల్య పురస్కారాలను ఆ విద్యా సంస్థల అధినేత సాలోమోన్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే ఉపాధ్యాయుల లక్ష్యమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణారెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి బీరప్పస్వామి జాతర**

రాయికోడ్ (అందోల్): రాయికోడ్ మండలంలోని మహమ్మదాపూర్‌లో ఐదు రోజుల పాటు నిర్వహించే బీరప్ప స్వామి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 5న గంగకు పోవడం, 6న బోనాలు, అన్నదానం, 7న బీరప్ప స్వామి, కామరతి దేవతల కల్యాణ మహోత్సవం, 8న నాగవెల్లి, గొల్ల బీర్లోళ్ల వేషధారణలతో కథ, 9న కడుపలు కడుగడంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం


ఆదర్శ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండాను ఎగరవేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలను ఇచ్చి తీర అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.